క్లుప్తంగా

సివిల్స్ టాపర్‌కు అభినందన


పవన్ దత్తను అభినందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ సివిల్స్ టాపర్‌గా నిలిచిన పవన్ దత్తను శనివారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అభినందించారు. యువకులు పవన్ దత్తను ఆదర్శంగా తీసుకొని రాణించాలని కోరారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.ప్రవీణ్, కె.రాధాకృష్ణ వర్మ, ఎస్వీయూ పాలక మండలి సభ్యుడు మల్లారపు మధు, జి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

బంగారు తిరుచ్చిపై కల్యాణ వెంకన్న చిద్విలాసం

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురంలో కొలువైన కల్యాణ వెంకటేశ్వరస్వామి శనివారం శ్రీదేవి, భూదేవి సమేతంగా బంగారు తిరుచ్చిపై ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి శనివారం సాయంత్రం స్వామి వారికి తిరుచ్చి వాహన సేవ నిర్వహించడం ఆనవాయితీ.

వైద్యశిబిరం పరిశీలన

తిరుపతి రూరల్: గ్రామాల్లో పేదలకు మెరుగైన కంటి చూపును ప్రసాదించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తిరుపతి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీహరి తెలిపారు. ఆయన శనివారం తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట వెల్‌నెస్ సెంటర్‌లో జరుగుతున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు.

ఘనంగా గంగ జాతర


విద్యుత్ లైట్లను పరిశీలిస్తున్న సర్పంచ్ రామచంద్రారెడ్డి, శ్రీధర్ రెడ్డి

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు గ్రామ దేవతగా పూజలందుకుంటున్న గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించనున్నట్టు సర్పంచ్ రామచంద్రారెడ్డి, పొక్కాలమ్మ ఆలయ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. 25వ తేదీన చాటు పొంగళ్లతో ప్రారంభమైన జాతర బుధవారంతో ముగియనున్నాయి. ఇందులో భాగంగా ఆది, సోమ, మంగళవారాల్లో గెరిగ ఊరేగింపు నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు వారు తెలిపారు. వారు శనివారం రాత్రి ఏర్పాట్లను పరిశీలించారు.

అత్యుత్తమ వైద్య సేవలు అందించండి

- జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి
- వైద్యసిబ్బందికి సర్టిఫికెట్ల పంపిణీ


సర్టిఫికెట్లు అందజేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి తుడా: బేసిక్ కార్డియాక్ లైఫ్ స్కిల్స్‌లో శిక్షణ పొందిన సిబ్బంది ప్రజలకు అత్యుత్తమ వైద్యసేవలు అందించాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. తిరుపతి రుయా ఆసుపత్రిలో 40 మంది వైద్య సిబ్బందికి ఈనెల 22 నుంచి బేసిక్ కార్డియాక్ లైఫ్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చారు. మొదటి బ్యాచ్‌లో ప్రాథమిక కార్డియాలజీ సమస్యలను ఎదుర్కోవడంపై నిపుణులు అవగాహన కల్పించారు. వారికి శనివారం కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేతులమీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎవరైనా హార్ట్ స్ట్రోక్‌కు గురైతే గోల్డెన్ టైంలో వారికి ప్రాథమిక చికిత్స అందించగలిగితే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం మండలాల వారీగా కొంత మంది వైద్యసిబ్బందికి బేసిక్ కార్డియాక్ లైఫ్ స్కిల్స్‌పై శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పొందిన సిబ్బంది ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో అందుబాటులో ఉండి కార్డియాక్ అరెస్ట్ వంటి సమస్యలు ఎదురైన వారికి వైద్యసేవలు అందిస్తారన్నారు. కార్డియో పల్మనరీ రెసిగ్నేషన్ కృత్రిమ మానవ బొమ్మల ద్వారా సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, డాక్టర్ సుబ్బారావు, నోడల్ ఆఫీసర్ ఎం.సుధాకర్ నాయక్, డాక్టర్ రవిశంకర్, ట్రైనింగ్ ఇన్‌చార్జ్, సీఎస్ ఆర్ఎంవో పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


పైపులైనును పరిశీలిస్తున్న ఈఓ, జేఈఓ

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం టీటీడీ ఈఓ ఏవీ. ధర్మారెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఆలయంలో ప్రస్తుతం ఉన్న ఐనామహల్, యాగశాలల స్థానంలో రాతి మండపం నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రికల్ కంట్రోల్ రూమ్‌ను ఆలయం బయటకు మార్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. శుక్రవారపు తోటలో ఆధునికీకరణ పనులు చేపట్టి నెయ్యి ట్యాంకు, పిండి మిల్లు, ఎలక్ట్రికల్ జనరేటర్ ఒకవైపు ఉండేలా ప్రహరీ గోడ నిర్మించాలని సూచించారు. శుక్రవారపు తోటలో ఉన్న పురాతన బావి, కోనేటి మండపానికి మరమ్మతు పనులు వేగవంతం చేయాలన్నారు. యాత్రికులు వేచి ఉండేందుకు పాత డిప్యూటీ ఈఓ కార్యాలయ భవనం స్థానంలో నూతన భవన నిర్మాణంపై నివేదిక అందజేయాలన్నారు. జేఈఓ వీరబ్రహ్మం, ఎఫ్ఏ సీఏఓ బాలాజీ, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈలు సత్యనారాయణ (ఎలక్ట్రికల్), వెంకటేశ్వర్లు, టీటీడీ సాంకేతిక సలహాదారు రామచంద్రారెడ్డి, డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఈఈ మనోహర్, ఏఈఓ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

టాలెంటెక్స్-2024 లోగో ఆవిష్కరణ


లోగోను ఆవిష్కరిస్తున్న దెందుకూరి శ్రీఫణి

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఎలెన్ కెరియర్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం టాలెంటెక్స్-2024 లోగోను ఆ సంస్థ తిరుపతి సెంటర్ హెడ్ డాక్టర్ దెందుకూరి శ్రీఫణి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకు టాలెంటెక్స్ పరీక్షను నవంబర్ 5న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో 5 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు రూ.1.25 కోట్లు నగదు పారితోషికంతో పాటు పలు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. తిరుపతిలో 2020లో ప్రారంభించిన తమ సంస్థ ద్వారా నిష్ణాతులైన అధ్యాపక బృందంతో విద్యార్థులకు ఉత్తమమైన బోధన అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ సంస్థలో శిక్షణ తీసుకున్న పదో తరగతి విద్యార్థిని చరితశ్రీ 588, సీబీఎస్ఈ పది ఫలితాల్లో మనోజ 484 మార్కులు, ప్రథమ సంవత్సరం ఇంటర్ ఎంపీసీలో శశిధర్, చైత్ర 464 మార్కులు, బైపీసీలో త్రిపుర 433, సీనియర్ ఇంటర్ ఎంపీసీలో మహేందర్‌రెడ్డి 981, బైపీసీలో కార్తిక్‌సాయి, శివానీ 971 మార్కులు సాధించారని పేర్కొన్నారు. అలాగే జేఈఈ మెయిన్స్‌లో 103 మంది శిక్షణ తీసుకోగా ఆరుగురు 99కిపైగా పర్సంటైల్ స్కోరు సాధించారని, 27 మంది ఎన్ఐటీకి అర్హత సాధించారని పేర్కొన్నారు. టాలెంటెక్స్ పరీక్షకు హాజరుకావాలనుకునే విద్యార్థులు 9900070050లో సంప్రదించాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

తిరుపతి తుడా: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆమె శనివారం ఇళ్ల నిర్మాణాలపై హౌసింగ్, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. కూలీలను ప్రతి లేఔట్‌లలో 500 మందికి తక్కువ కాకుండా చూసుకోవాలని సూచించారు. లేఅవుట్లలో మరిన్ని పవర్ బోర్లు వేయించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డీఈలు సంజీవ్ కుమార్, రవీంద్రారెడ్డి, దేవిక, గోమతి, మహేష్, హౌసింగ్ అధికారులు మోహన్ రావు, శ్రీనివాస రావు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు అమోఘం


వలంటీర్లతో కార్పొరేటర్లు ఎస్‌కేబాబు, కోటూరు ఆంజనేయులు

తిరుపతి తుడా: ప్రభుత్వానికి- ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ గ్రామ వలంటీర్ల సేవలు అమూల్యమైనవి అని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్‌కే.బాబు తెలిపారు. ఆయన శనివారం కార్పొరేటర్ కొటూరు ఆంజనేయులుతో కలిసి 12, 13 డివిజన్లలోని వలంటీర్లకు వందనం సేవా పురస్కారాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి వద్దకే తీసుకెళ్లడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. కోటూరు శశి, మధు, రాజేష్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు వృద్ధురాలి మృతి

తిరుపతి తుడా: తిరుపతి కొర్లగుంట మెయిన్ రోడ్డు దాటుతూ శనివారం వృద్ధురాలు మృతి చెందింది. కొర్లగుంట మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అక్కడ ఎవరూ రాకుండా బారికేడ్లు, నో ఎంట్రీ బోర్డు ఏర్పాటు చేశారు. వరలక్ష్మి (72) బారికేడ్లను దాటుకుని వచ్చే క్రమంలో కాలుజారి కాంక్రీట్ మిక్సర్ మెషిన్ కింద పడిపోయింది. తీవ్రంగా గాయపడిన ఆమెను సిబ్బంది రుయాకు తరలించారు. అక్కడ ఆమె మృతి చెందింది. విషయం తెలుసుకున్న డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ పుల్లూరు అమర్‌నాథరెడ్డి అక్కడికి చేరుకున్నారు. జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

యువతి మృతదేహానికి పోస్టుమార్టం

భాకరాపేట: నీటి కుంటలో పడి మృతి చెందిన యువతి మీనా మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించినట్లు భాకరాపేట పోలీసులు తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచెర్ల పంచాయతీ దాసరగూడెంకు చెందిన మీనా ఐదు రోజుల క్రితం అదృశ్యమైంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. గురువారం సాయంత్రం ఆమె మృతదేహం నీటి కుంటలో కనిపించింది. ఆత్మహత్యగా కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: కర్బన ఉద్గారాలను తగ్గించి గాలి నాణ్యతను పెంచడంతోపాటు పర్యావరణాన్ని కాపాడుకుందామని ప్రాంతీయ పర్యావరణ విభాగం ఇంజినీర్ నరేంద్రబాబు పిలుపునిచ్చారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పర్యావరణ పరిరక్షణపై శనివారం ర్యాలీ నిర్వహించారు. తిరుపతిలోని ప్రధాన కూడళ్ల వద్ద పర్యావరణ ఇంజినీర్లు, ప్రాంతీయ రవాణాశాఖ అధికారులు ప్లకార్డులతో నినాదాలు చేశారు. ట్రాఫిక్ సిగ్నల్ ఉన్నప్పుడు వాహనాల ఇంజిన్‌ను ఆఫ్ చేయాలని సూచించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ యువకిషోర్, సహాయ పర్యావరణ ఇంజినీర్లు మదన్‌మోహన్‌రెడ్డి, పీవీ కిషోర్ రెడ్డి, శశికళ, ఆర్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.


అనధికార వ్యక్తుల ఏరివేతకు రంగం సిద్ధం

తిరుమల : తిరుమలలో అనధికార వ్యక్తుల ఏరివేతకు టీటీడీ రంగం సిద్ధం చేసింది. తిరుమలలో హోటళ్లకు కేటాయించిన 24 కాటేజీలను రద్దు చేస్తున్నట్లు టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ ప్రకటించారు. ఆయన శనివారం తిరుమల రెవెన్యూ కార్యాలయంలో భద్రతా చర్యలపై టీటీడీ అధికారులు సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ హోటళ్లకు కేటాయించిన 24 కాటేజీలను 3 రోజుల్లో ఖాళీ చేయాలనీ, ప్రత్యామ్నాయ వసతి కల్పిస్తామన్నారు. ప్రతి నెలా విధిగా 5వ తేదీ లోపు దుకాణాల లైసెన్స్ రుసుము చెల్లించాలని ఆదేశించారు. ధరల పట్టిక కనపడేలా ఏర్పాటు చేయాలన్నారు. స్థానికంగా ఉన్న వారిని గ్రూపులుగా విభజించి బాలాజీ నగర్, ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్‌లో శుద్ధ తిరుమల సుందర తిరుమల కార్యక్రమం నిర్వహిస్తామని తెలియజేశారు.

నలుగురు ఎర్ర కూలీల అరెస్టు

చంద్రగిరి(తిరుపతి రూరల్): మారణాయుధాలతో అటవీ ప్రాంతంలోకి వెళుతున్న నలుగురు ఎర్రచందనం కూలీలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం చంద్రగిరి మండలం రంగంపేట సమీపంలోని కల్యాణీ డ్యాం మార్గంలో అరెస్ట్ చేశారు. డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబు మాట్లాడుతూ టాస్క్‌ఫోర్స్ ఆర్ఐ సురేష్‌కుమార్ రెడ్డి, ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ ఆధ్వర్యంలోని పోలీసులు శుక్రవారం రాత్రి భాకరాపేట వైపు ఉన్న ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీ చేపట్టారు. శనివారం ఉదయం 5గంటల ప్రాంతంలో శ్రీవారిమెట్టు సమీపంలో ఆటోలో నలుగురు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని తనిఖీ చేయగా మారణాయుధాలు కనిపించాయి. వారిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో తమిళనాడు కల్లకురిచ్చి జిల్లా మేల్ వెల్లిమలైకు చెందిన ఆండి సైదయ్యన్ (41), ఆండివల్లి (51), పళనిస్వామి (40), తిరుపతి జిల్లా చంద్రగిరి పాతపేటకు చెందిన వడమాలై జమని ఎలియాస్ జెమిని గణేష్ (46)గా గుర్తించారు. ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మోహన్‌నాయక్ దర్యాప్తు చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశం



భాకరాపేట: చిన్నగొట్టిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1996-97లో పదో తరగతి చదివిన విద్యార్థులు శనివారం సమావేశమయ్యారు. అప్పటి ఉపాధ్యాయులకు పాద పూజ చేసి ఘనంగా సన్మానించారు. పాఠశాలకు రూ.లక్ష విలువైన జిరాక్స్ మెషిన్, ప్రింటర్ అందజేశారు. పూర్వ విద్యార్థుల కో-ఆర్డినేటర్స్ రెడ్డీశ్వర్‌రెడ్డి, హరినాథగుప్త, పవన్, మోహన్, మురళీ, గోమతి, భారతి, గణేష్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

తిరుపతి అపోలోలో లివర్ క్లినిక్ సేవలు

తిరుపతి తుడా: స్థానిక లక్ష్మీపురం సర్కిల్‌లోని తిరుపతి అపోలో ఆసుపత్రిలో నెలవారీ లివర్ క్లినిక్ సేవలను ప్రారంభించినట్లు కాలేయ మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ కె.ఎలంకుమారన్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. లివర్ డిసీజెస్ అండ్ ట్రాన్స్‌ప్లాంటేషన్ సెంటర్‌తో కలిసి తిరుపతిలో నెలవారీ లివర్ క్లినిక్ సేవలు అందించనున్నామని చెప్పారు.

ఘనంగా పాపులేషన్ స్టడీస్ స్వర్ణోత్సవాలు

తిరుపతి ఎడ్యుకేషన్: ఎస్వీయూలోని పాపులేషన్ స్టడీస్ స్వర్ణోత్సవాలను శనివారం సెనేట్ హాలులో ఘనంగా నిర్వహించారు. వీసీ కే.రాజారెడ్డి మాట్లాడుతూ 1973లో అప్పటి వీసీ డీజే.రెడ్డి పాపులేషన్ స్టడీస్ విభాగాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. అనంతరం జరిగిన గోల్డెన్ జూబ్లీ జాతీయ సెమినార్‌లో పాపులేషన్ ఏజింగ్ ఇన్ ఇండియా - ఛాలెంజర్స్ అండ్ ఆపర్చునిటీస్ అనే అంశంపై అనేకమంది అధ్యాపకులు, పరిశోధకులు పరిశోధన పత్రాలు సమర్పించారు. విభాగాధిపతి టి.చంద్రశేఖరయ్య, ఎడ్యుకేషన్ కౌన్సిల్ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ లక్ష్మమ్మ, ఎంఎస్‌డబ్ల్యూ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డి.సాయిసుజాత పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శనివారం ఎమ్మెల్యే వాసు బాబు, ఐఏఎస్ అధికారి ప్రద్యుమ్న, నేషనల్ సఫాయి కర్మచారి కమిషన్ చైర్మన్ వెంకటేశన్ దర్శించుకున్నారు. వీరికి అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు.


అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- ఎంపీపీ లోకనాథం


మాట్లాడుతున్న ఎంపీపీ లోకనాథం

పాకాల: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ లోకనాథం అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. విద్యుత్ శాఖ ఏఈ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ప్రతి ఇంటికీ నగదు రహితంగా విద్యుత్ కనెక్షన్లు అందజేస్తామన్నారు. పాకాల సర్పంచ్ ఎస్.కస్తూరి పాకాల పంచాయతీ పేరుపై విద్యుత్ బిల్లులు వస్తున్నాయని తెలిపారు. వాటిని సరిచేయాలని సూచించారు. అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ నిరక్షరాస్యతను రూపుమాపేందుకు ప్రభుత్వం త్వరలోనే భారత నూతన అక్షరాస్యత కార్యక్రమాన్ని ప్రారంభించనుందని తెలిపారు. హౌసింగ్ ఏఈ మహేష్ మాట్లాడుతూ మండలంలో 1800 ఇళ్లు మంజూరయ్యాయని, వాటిలో 638 ఇళ్లు ఇప్పటికే పూర్తయ్యాయని వివరించారు. ఏపీఎం కోమలాదేవి మాట్లాడుతూ మండలంలో 426 డ్వాక్రా సంఘాలు ఉన్నాయని, వాటికి 6వ విడతలో రూ.4.26 కోట్ల నిధులు మంజూరైనట్టు తెలిపారు. ఎంపీడీఓ రమేష్‌బాబు,ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నందకిషోర్, పీఆర్ ఏఈ నాగేంద్ర, ఏపీఓ దీప, ఏఓ పుష్పావతి, సింగిల్ విండో ప్రెసిడెంట్ మునీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నా కుమారుడు ఆచూకీ తెలపండి


షేక్ సలీం

చంద్రగిరి(తిరుపతి రూరల్): ఇంటి నుంచి వెళ్లిపోయిన కుమారుడి ఆచూకీ తెలపాలని చంద్రగిరి మండలం, అగరాలకు చెందిన షేక్ షబ్బీర్ పోలీసులను వేడుకున్నాడు. అతని కుమారుడు షేక్ సలీం తిరుపతిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. రెండు రోజుల క్రితం మసీదుకని వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై సలీం తండ్రి చంద్రగిరి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు.

కుర్రకాలువ భూ బాధితులకు అండ

తిరుపతి అర్బన్: కొందరు దళారులు తమ ప్లాట్లకు ఇబ్బందులున్నాయంటూ డబ్బులు వసూలు చేస్తున్నారని రేణిగుంట మండలం కుర్రకాలువ ప్రాంతంలో ఇంటి పట్టాలున్నవారు వాపోయారు. వారు శనివారం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెంటనే శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావుతో ఫోన్‌లో మాట్లాడారు. దళారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇంటి పైకప్పు వేసుకోనివ్వడం లేదు..!

తిరుపతి కల్చరల్: ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇంటికి పైకప్పు వేసుకుంటుంటే అడ్డుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎర్రావారిపాళెం మండలం చెరుకులవారిపల్లికి చెందిన గిరిజనులు దొరబాబు, వేణుక వాపోయారు. వారు శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. 2003లో అప్పటి తహసీల్దార్ తమకు ఒకటిన్నర సెంటు స్థలం మంజూరు చేశారని తెలిపారు. అందులో ఇంటి పైకప్పు వేసుకోవడానికి ప్రయత్నించామని వెల్లడించారు. గ్రామానికి చెందిన అగ్రవర్ణాల వారైన జయమ్మ, మల్లిరెడ్డి ప్రోద్బలంతో స్థానిక తహసీల్దార్ దస్తగిరి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరి

తిరుచానూరు(చంద్రగిరి): శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం సాయంత్రం నిర్వహించిన గాత్ర కచేరి ఆకట్టుకుంది. తిరుపతికి చెందిన గాయకులు శివాని, షణ్ముఖ పలు గీతాలు ఆలపించారు. వారికి శిల్పారామం ఏఓ ఖాదర్‌వలి జ్ఞాపికలు అందజేసి, సత్కరించారు.